సాక్షి
కామారెడ్డి
బుధవారం • 1 • మే • 2024



పథకాలను చూసి ఓటేయండి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసి కాంగ్రెస్‌కు ఓటేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కోరారు.

- IIలో ▸



మోదీ సభకు శ్రేణులు

అల్లాదుర్గంలో మంగళవారం నిర్వహించిన ప్రధాని మోదీ సభలో పాల్గొనేందుకు జిల్లా నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లాయి.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.9 /24.7

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలి'



కామారెడ్డి టౌన్: జిల్లాలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్ బాబు ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని సిరిసిల్లారోడ్‌లో, కలెక్టర్ కార్యాలయం వద్ద గల 33/11 సబ్ స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా అందుబాటులో ఉండాలని ఏఈలు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కామారెడ్డి డివిజనల్ ఇంజినీర్ సాల్యా నాయక్, డీఈ టెక్నికల్ వెంకటరంగయ్య, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కిరణ్, ఏఈలు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: మే నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఆహార భద్రత కార్డులపై ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున బియ్యం అందిస్తారు. బుధవారం నుంచి 15వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ అధికారులు తెలిపారు.

'ఫెయిలైన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలి'



కామారెడ్డి టౌన్: ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. మంగళవారం ఆయన జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఇంటర్ ఫలితాలపై సమీక్షించారు. ఇంటర్‌లో జిల్లా చిట్టచివరి స్థానంలో నిలవడం నిరాశ కలిగించిందన్నారు. విద్యార్థులు కళాశాలలకు సరిగా రాకపోవడంతో ఫలితాలపై ప్రభావం పడిందని ప్రిన్సిపాల్స్ వివరించారు. ఈ సందర్భంగా షేక్ సలాం మాట్లాడుతూ ఫెయిలైన వారిపై గ్రూప్‌లు, సబ్జెక్టుల వారీగా ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరం అయితే ఆన్‌లైన్‌లో తరగతులు తీసుకోవాలని సూచించారు. ఫెయిలైన వారు పాసయ్యేలా చూడాలన్నారు. ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

ఆస్తి పన్ను రాయితీకి అనూహ్య స్పందన



కామారెడ్డి టౌన్: ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీకి అనూహ్య స్పందన లభించింది. రాయితీకి మంగళవారం చివరి రోజు కావడంతో బకాయిదారులు క్యూ కట్టారు. దీంతో మంగళవారం ఒక్కరోజే రూ. 39 లక్షల వరకు ఆస్తి పన్ను వసూలయ్యింది. 5 శాతం రాయితీతో నెల రోజుల్లో మొత్తం రూ. 1.65 కోట్లు వసూలయ్యాయని అధికారులు తెలిపారు. ఆస్తి పన్నులు చెల్లించని వారి ఆస్తులను జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ సుజాత హెచ్చరించారు.

నేడు ప్రొఫెసర్ కోదండరాం రాక



కామారెడ్డి టౌన్: టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం బుధవారం జిల్లాకు రానున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'ప్రమాదంలో భారత ప్రజాస్వామ్యం -మనమేం చేద్దాం' అనే అంశంపై నిర్వహించే బహిరంగ చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మేధావులు పాల్గొనాలని కోరారు.

'పది'లోనూ నిరాశే!

- ఎస్సెస్సీ ఫలితాల్లో వెనకబడిన జిల్లా
- గతేడాది ఏడు.. ఈసారి 19వ స్థానం
- జిల్లాలో 92.71 శాతం ఉత్తీర్ణత
- ఈసారీ బాలికలదే పైచేయి



కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. పదో తరగతిలోనూ జిల్లా విద్యార్థులు నిరాశ పరిచారు. గతేడాది ఫలితాల్లో రాష్ట్రంలో ఏడోస్థానంలో నిలిచిన జిల్లా.. ఈసారి 19వ స్థానానికి పడిపోయింది. కాగా ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో జిల్లా అట్టడుగు స్థానానికి పడిపోయిన విషయం తెలిసిందే.

మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పదోతరగతి వార్షిక పరీక్షలు జరిగాయి. జిల్లాలో 11,926 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో 11,057 మంది ఉత్తీర్ణత సాధించగా 869 మంది ఫెయిల్ అయ్యారు. ఉత్తీర్ణత 92.71 శాతంగా నమోదయ్యింది. ప్రతిసారి లాగే ఈసారీ బాలికలే పైచేయి సాధించారు. 6,047 మంది బాలికలు పరీక్షలు రాయగా.. 5,706 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 94.36 గా నమోదయ్యింది. బాలురలో 5,879 మందికిగాను 5351 మంది పాస్ అయ్యారు. 91.02 శాతం ఉత్తీర్ణత సాధించారు. 99.44 శాతం ఉత్తీర్ణతతో పెద్దకొడప్‌గల్ అగ్రస్థానంలో ఉండగా.. 75.64 శాతంతో గాంధారి చిట్టచివరన నిలిచింది.

మేనేజ్‌మెంట్ల వారీగా..

బీసీ వెల్ఫేర్ గురుకులాల్లో 384 మంది విద్యార్థులు ఉండగా.. అందరూ పాసయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 84.44 శాతం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 88.79 శాతం, కేజీబీవీల్లో 94.31, మోడల్ స్కూల్స్‌లో 96.52, ప్రైవేట్‌లో 98.47, మైనారిటీ రెసిడెన్షియల్స్‌లో 98.37, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్స్‌లో 99.04, ట్రైబల్ వెల్ఫేర్‌లో 98.09, ఎయిడెడ్ పాఠశాలల్లో 77.78 శాతం ఉత్తీర్ణులయ్యారు.

ఏటా తగ్గుతున్న ఫలితాలు..

జిల్లాలో పదో తరగతి ఫలితాలు ఏటా తగ్గుతున్నాయి. 2018-19 విద్యాసంవత్సరంలో 96.63 శాతం పాసయ్యారు. 2019-20, 2020-21 విద్యాసంవత్సరాలలో కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించలేదు. దీంతో అందరినీ పాస్ చేశారు. 2021-22లో 96.58 శాతం ఉత్తీర్ణతతో జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. 2022-23 లో ఉత్తీర్ణత 93.32 శాతానికి తగ్గడంతో జిల్లా ర్యాంకు ఏడుకు పడిపోయింది. ఈ ఏడాది 92.71 శాతమే ఉత్తీర్ణులవడంతో జిల్లాస్థానం 19కి దిగజారింది.

132 మందికి 10 జీపీఏ..

జిల్లాలో 132 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. కామారెడ్డిలో 50 మంది, సదాశివనగర్‌లో 35 మంది, భిక్కనూరులో 11 మంది, బాన్సువాడలో ఎనిమిది మంది, తాడ్వాయిలో ఏడుగురు, దోమకొండలో ఆరుగురు, మాచారెడ్డి, పిట్లంలలో ముగ్గురు చొప్పున, బీబీపేట, బిచ్కుందలలో ఇద్దరి చొప్పున, బీర్కూర్, నస్రుల్లాబాద్‌లలో ఒక్కరు చొప్పున 10 జీపీఏ సాధించారు. 204 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 226 మంది 9.7 జీపీఏ, ఒక్కరు 9.6 జీపీఏ, 291 మంది 9.5 జీపీఏ, ఇద్దరు 9.4 జీపీఏ, 332 మంది 9.3 జీపీఏ, 396 మంది 9.2 జీపీఏ, 419 మంది 9 జీపీఏ గ్రేడ్ పొందారు.

మండలాల వారీగా ఉత్తీర్ణత శాతం..

మండలం	పరీక్ష రాసినవారు	ఉత్తీర్ణత	శాతం				
				తాడ్వాయి	420	398	94.76
				పిట్లం	517	489	94.58
పెద్దకొడప్‌గల్	179	178	99.44	బీబీపేట	345	325	94.20
దోమకొండ	457	450	98.47	కామారెడ్డి	1925	1813	94.18
నిజాంసాగర్	396	389	98.23	రామారెడ్డి	393	367	93.38
సదాశివనగర్	550	540	98.18	ఎల్లారెడ్డి	714	659	92.30
జుక్కల్	335	325	97.01	నాగిరెడ్డిపేట	446	403	90.36
బీర్కూర్	267	258	96.63	బాన్సువాడ	1192	1051	88.17
రాజంపేట	298	287	96.31	బిచ్కుంద	551	481	87.30
మాచారెడ్డి	540	515	95.37	నస్రుల్లాబాద్	236	202	85.59
లింగంపేట	623	593	95.18	మద్నూర్	606	513	84.65
భిక్కనూరు	587	557	94.89	గాంధారి	349	264	75.64

జూన్ 3 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 3వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.రాజు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారంనుంచి 16వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. మూడు సబ్జెక్టుల వరకు ఒక్కో సబ్జెక్టుకు రూ. 110 చొప్పున, అంతకన్నా ఎక్కువ ఫెయిల్ అయితే సబ్జెక్టుకు రూ. 125 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

రీకౌంటింగ్‌కు అవకాశం..

పదో తరగతి పరీక్ష ఫలితాల రీకౌంటింగ్‌కు 15 రోజుల వరకు అవకాశం ఉందని డీఈవో తెలిపారు. సబ్జెక్టుకు రూ. 500 చొప్పున ఫీజు చెల్లించి రీకౌంటింగ్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. సబ్జెక్టుకు రూ. 1,000 చొప్పున చెల్లించి జవాబు పత్రాల ఫొటో కాపీ పొందవచ్చన్నారు.

విధులలో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ పాటిల్, ఎస్పీ సింధు శర్మ, అధికారులు

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- లోక్‌సభ రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరు

కామారెడ్డి క్రైం: ఎన్నికల విధుల విషయంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జహీరాబాద్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల పరిశీలకులు గోపాల్ జీ తివారి, వ్యయ పరిశీలకులు మోతీలాల్ ఎస్ షీటే, కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల వివరాలు, రూట్ మ్యాప్‌లో ఓటర్ల వివరాలను సంగారెడ్డి, కామారెడ్డి కలెక్టర్‌లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ మాట్లాడుతూ వంద శాతం పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సి-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. విధులలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్పీ రూపేశ్, కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

'రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి'



సబ్దల్‌పూర్‌లో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

ఎల్లారెడ్డిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆదేశించారు. మంగళవారం సబ్దల్‌పూర్, శివానగర్ గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని వెంటవెంటనే కాంటా చేసి రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద నీడ, తాగునీటి వసతులు కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ నిత్యానందం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు సురేష్, ఖాలేద్, ఎల్లారెడ్డి సొసైటీ సీఈవో విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ జిల్లాలో 93.72 శాతం ఉత్తీర్ణత

నిజామాబాద్ అర్బన్: ఎస్సెస్సీ ఫలితాల్లో నిజామాబాద్ జిల్లాలో 93.72 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జిల్లావ్యాప్తంగా 21,858 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 20,486 మంది పాసయ్యారు. ఇందులో బాలురు 11,144 మందికి 10,330 మంది(92.70శాతం) ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 10,714 మందికి 10,156 మంది (94.79 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గతేడాది 21వ స్థానంలో ఉన్న జిల్లా ఈసారి 14వ స్థానానికి ఎగబాకింది. జిల్లా వ్యాప్తంగా 243 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. 284 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. గతేడాది 163 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, 153 మంది 10 జీపీఏ సాధించారు.

ఐదు కళాశాలల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న డైరెక్టర్ చంద్రశేఖర్

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2024-25 విద్యా సంవత్సరానికి అనుబంధ గుర్తింపు కోసం డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిర్వహిస్తున్న తనిఖీలు మంగళవారం కొనసాగాయి. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ నేతృత్వంలో వర్సిటీ పరిధిలోని కామారెడ్డి జిల్లాలోని వశిష్ట, శ్రీవైష్ణవి, విజ్ఞాన భారతి, పీజీఆర్ స్ఫూర్తి, సాందీపని డిగ్రీ కాలేజీలలో తనిఖీలు నిర్వహించారు. యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీ నిర్దేశించిన నిబంధనల మేరకు వసతి సౌకర్యాలు ఉన్నాయా లేవా అనే అంశాలను పరిశీలించారు. సొంత భవనాలు, తగినన్ని తరగతి గదులు, క్రీడా మైదానం లేని కళాశాలల వారికి నోటీసులు అందజేసినట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ, డీన్స్ రాంబాబు, ఆరతి, లావణ్య, ఇంగ్లిష్ విభాగాధిపతి రమణాచారి, రసాయనశాస్త్రం విభాగాధిపతి అడికె నాగరాజు పాల్గొన్నారు.

'రోడ్‌షోను విజయవంతం చేయండి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు మద్దతుగా ఈనెల 4న బాన్సువాడలో భారీ రోడ్‌షో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రోడ్‌షోను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. మంగళవారం ఆయన బాన్సువాడలోని తన నివాసంలో బాన్సువాడ పట్టణ, గ్రామీణ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోగానే కొంతమంది నాయకులు డబ్బులకు అమ్ముడుపోయి కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆరోపించారు. నిజమైన నాయకులు, కార్యకర్తలు అప్పుడు, ఇప్పుడు ఎప్పుడూ తనకు అండగానే ఉన్నారన్నారు. ఈనెల 7వ తేదీన కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొంటారని, ఆ సభను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, జంగం గంగాధర్, దాసరి శ్రీనివాస్, మోహన్‌నాయక్, సంగ్రాంనాయక్, ఎస్.నర్సింలు, కమటాల శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదిహేను స్థానాలు పక్కా

- కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడుదొంగలు
- రిజర్వేషన్లపై అమిత్‌షా మాటలను వక్రీకరించారు
- తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



ప్రధాని మోదీకి జ్ఞాపిక అందిస్తున్న బీబీ పాటిల్, చిత్రంలో రఘునందన్‌రావు, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

మెదక్‌జోన్/అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తోడుదొంగలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం అల్లాదుర్గం మండలం చిల్వెరలో ఏర్పాటు చేసిన జనసభలో ఆయన ప్రసంగించారు. బీజేపీకి వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని పేర్కొన్నారు. అందుకే బీజేపీని బద్నామ్ చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా మాటలను వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల ఏప్రిల్ 25న సిద్దిపేటలో జరిగిన సభలో మతపరమైన రిజర్వేషన్లను రద్దు చేస్తామని అమిత్‌షా చెబితే.. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఫేక్ వీడియోలు సృష్టించి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటివారిని వదలబోమని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 15 స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఏ మారుమూల గ్రామానికెళ్లినా ఈసారి బీజేపీకే తమ ఓటంటూ తీర్మానాలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు.

అధికారం కోల్పోయాకే గుర్తొచ్చారా?

అధికారం కోల్పోయాకనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు వచ్చారని బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గద్దె దిగితేనే ప్రజలు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసులో ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ప్రథమ ముద్దాయి అని, లిక్కర్ కేసులో ఇప్పటికే ఆయన మరదలు (కవితను) తీహార్ జైలుకు పంపారన్నారు. ఆమెను జైల్లో పరామర్శించిన హరీశ్‌రావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావులు ఇటీవల ఢిల్లీ నుంచి ఒకే విమానంలో పక్కపక్కనే కూర్చొని రెండుగంటల పాటు మాట్లాడుకుంటూ వచ్చారన్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం 25 ఎమ్మెల్యేలతో హరీశ్‌రావు పార్టీ మారే అవకాశాలు ఉన్నాయని జోస్యం చెప్పారు.

ఓటమి భయంతోనే మత విద్వేషాలు

కాంగ్రెస్ ఓటమి భయంతో మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలు చేపడుతుందని జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. మోదీ పదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రి చేయడానికి కమలం గుర్తుకు ఓటేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇద్దరు ముఖ్యమంత్రులను ఓడించింది బీజేపీ కార్యకర్తలేనని చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సభలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, దక్, సంగారెడ్డి, కామారెడ్డి పార్టీ జిల్లాల అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, గోదావరి అంజిరెడ్డి, అరుణతార, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలదళంలో జోష్

సాక్షి, కామారెడ్డి: మెదక్ జిల్లా అల్లాదుర్గంలో మంగళవారం నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభ విజయవంతం కావడంతో బీజేపీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. సభలో ప్రధానమంత్రి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విరుచుకుపడ్డారు. ఆ పార్టీలు వేరు కాదని, రెండూ అవినీతిలో ఒకటేనని పేర్కొన్నారు. ఒకరిని మించి మరొకరు అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. మోదీ మాట్లాడుతున్నంత సేపు బీజేపీ కార్యకర్తలు మోదీ, మోదీ అంటూ ఏకధాటిగా నినాదాలు చేశారు. సభా ప్రాంగణమంతా మోదీ నామస్మరణతో దద్దరిల్లింది. సభకు మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి సుమారు లక్షకుపైగా జనం తరలివచ్చారు. ఎండలు మండుతున్న సమయంలోనూ జనం భారీగా తరలిరావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.

సంగమేశ్వరుడికి మోదీ ప్రణామం

జహీరాబాద్: ఎన్నికల ప్రచారం నిమిత్తం వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగానికి ముందు జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగంలో గల కేతకీ సంగమేశ్వరుడికి సభావేదికపై నుంచి ప్రణామం చేశారు. అనంతరం బసవేశ్వరుడు, సేవాలాల్ మహారాజ్‌లను సైతం స్మరించుకున్నారు. కేతకీ సంగమేశ్వరాలయం దక్షిణ కాశీగా విరాజిల్లుతోంది. జిల్లాలోనే కాకుండా పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని భక్తులు ఈ ఆలయానికి వస్తుంటారు. ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉన్నందున ప్రధాని.. సంగమేశ్వరుడిని నమస్కరించుకున్నారు. అంతే కాకుండా జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ పరిధిలో లింగాయత్‌లు అధికంగా ఉండడం, వారి దైవం బసవేశ్వరుడు కావడంతో ఆయన పేరును, గిరిజన తండాలు సైతం అధికంగా ఉండటంతో వారి దైవమైన సేవాలాల్ మహారాజ్ పేర్లను స్మరించుకున్నారు. ప్రజల సెంటిమెంట్ తెలుసుకుని, వారిని స్మరించడంతో సభకు వచ్చిన జనం సంతోషంతో కేరింతలు కొట్టారు.

సభ సైడ్‌లైట్స్

- సాయంత్రం 4.13 గంటలకు హెలికాప్టర్ ద్వారా పీఎం మోదీ వచ్చి సభాప్రాంగణానికి చేరుకున్నారు.
- 4.33 గంటలకు స్టేజీపైకి చేరుకొని అభివాదం చేశారు.
- 4.43 గంటలకు మోదీ ప్రసంగాన్ని ప్రారంభించారు. 5.50కు ప్రసంగం ముగిసింది.
- 5.51 గంటలకు స్టేజీపై నుంచి కిందికి వెళ్లిపోయారు.
- 6.01 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగు పయనమయ్యారు.

క్లుప్తంగా

'పది'లో దివ్యాంగుడి ప్రతిభ



భిక్కనూరు: సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు గర్దాస్ ప్రభాస్ మంగళవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. ప్రభాస్ మానసిక వికలాంగుడు కావడంతో ఆయన తల్లిదండ్రులు భవిత పాఠశాలకు పంపించారు. భవిత పాఠశాల ఉపాధ్యాయుడు మహేందర్ శిక్షణ ఇవ్వడంతో ప్రభాస్ దివ్యాంగుడైనప్పటికీ 7.5 జీపీఏ సాధించాడు. జిల్లాలో ఉన్న దివ్యాంగుల్లో ప్రభాస్ 7.5 జీపీఏ సాధించి ప్రథమ స్థానం పొందాడు.

కాంగ్రెస్‌లో చేరిక



రాజంపేట: రాజంపేట గ్రామ మాజీ ఉప సర్పంచ్ పటేల్ సాయిబాబా, బీఆర్ఎస్ పార్టీ గ్రామ రైతు బంధు కన్వీనర్ కుమ్మరి భిక్షపతి, పెద్దమల మల్లేష్, మ్యాకల నరేష్‌లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తామని వారు తెలిపారు. మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, యూత్ అధ్యక్షుడు క్రిష్టారావ్, గ్రామ అధ్యక్షుడు బెస్త చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో నిరుద్యోగ సమస్య



బాన్సువాడ రూరల్: కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను అడ్డగోలుగా ప్రయివేట్ పరం చేయడంతో దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపేట్ జీపీ పరిధిలోని కన్నయ్య తండాతో పాటు దేశాయిపేట్‌లో పర్యటించి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ పథకాలను చూసి ఓటేయండి

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్
- పలు చోట్ల విస్తృతంగా కాంగ్రెస్ నేతల ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రాబోయే లోక్‌సభ ఎన్నికలలో జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ కోరారు. తాడ్వాయి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను చూసి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. పార్టీలో కష్టపడిన వారికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. బీబీ పాటిల్ 10 సంవత్సరాలు ఎంపీగా ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, నియోజకవర్గంలో గ్రామాలు కూడా సరిగ్గా తెలియని వ్యక్తి అని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు అకిల్ రావు, నాయకులు మహేందర్‌రెడ్డి, షౌకత్‌అలీ, వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షెట్కార్ గెలుపునకు కృషి చేయాలి

నిజాంసాగర్(జుక్కల్): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపు కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో వ్యాపారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జహీరాబాద్ పార్లమెంట్ మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. నాయకులు అస్పత్‌వార్ వినోద్ తదితరులున్నారు.

పేదల మేలు కోరే పార్టీ కాంగ్రెస్

బాన్సువాడ రూరల్: దేశంలో పేదల మేలు కోరే పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడ్కోల్ గ్రామ చెరువులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు తాడ్కోల్ వెంకట్రామిరెడ్డి, దత్తు, రమేష్, సుజీత్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమర్యాగడితండాలో..

ఎల్లారెడ్డి: మండలంలోని పలు గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కుర్మ సాయిబాబా మండలంలోని సోమర్యాగడితండా, మత్తమాల, రుద్రారం తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బాబుసింగ్

బిచ్కుంద(జుక్కల్) : రాష్ట్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులకు సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం తక్కడ్‌పల్లి కాంగ్రెస్ కార్యకర్తలు విజయోత్సవ సభ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేను నాయకులు రవి పటేల్, హన్మంత్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశల వారీగా నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సురేశ్ షెట్కార్ గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయా పార్టీల నుంచి కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దాం

నిజాంసాగర్(జుక్కల్): భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు తమ వంతు కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం రాత్రి పిట్లం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహనీయుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. దళితుల సంక్షేమానికి పాటు పడటంతో పాటు దళితులకు అన్నివిధాలుగా అండగా ఉంటానన్నారు. అంబేద్క ర్ రాసిన రాజ్యాంగంతోనే తాను జుక్కల్‌కు ఎమ్మెల్యేను అయ్యానన్నారు. అనంతరం పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భర్త బాబుసింగ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ షెట్కార్, ఆగ్రోచైర్మన్ కాసుల బాల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే, కాంగ్రెస్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఉన్నారు.

మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం



మాట్లాడుతున్న బీజేపీ నేత నేరెళ్ల ఆంజనేయులు

లింగంపేట(ఎల్లారెడ్డి): దేశ ప్రజలు మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి, బీజేపీ నేత నేరెళ్ల ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన లింగంపేట బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. మోదీ పదేళ్ల పాలనలో తనపై తన మంత్రివర్గ సహచరులపై ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేవన్నారు. అవినీతి రహిత పాలన మోదీతోనే సాధ్యమన్నారు. త్వరలో కరీంనగర్-కామారెడ్డి- ఎల్లారెడ్డి- పిట్లం జాతీయ రహదారి పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇప్పటికే సంగారెడ్డి-నాందేడ్- అకోలా జాతీయ రహదారి పూర్తయినట్లు పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు ఎరువుల కోసం కోట్లాది రూపాయలు సబ్సిడీపై అందజేస్తున్నట్లు తెలిపారు. 'ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్' అనే నినాదంలో 400 ఎంపీ సీట్లు గెలుపొందడం ఖాయమన్నారు. జహీరాబాదు ఎంపీగా బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు మాసుల శ్రీనివాస్, దత్తురాం, సాయన్న పాల్గొన్నారు.

మోదీ సభకు బీజేపీ శ్రేణులు



తుంకిపల్లి నుంచి తరలి వెళ్తున్న బీజేపీ శ్రేణులు



ఎల్లారెడ్డి నుంచి..

నిజాంసాగర్(జుక్కల్): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సభకు మంగళవారం నిజాంసాగర్, మహమ్మద్ నగర్, జుక్కల్ మండలాల నుంచి బీజేపీ శ్రేణులు తరలి వెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో సంగారెడ్డికి తరలివెళ్లారు.

ఎల్లారెడ్డి నుంచి..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డికి చెందిన బీజేపీ నాయకులు మంగళవారం మోదీ సభకు తరలివెళ్లారు. ఆంథోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గంలో నిర్వహించనున్న మోదీ సభకు మండలానికి చెందిన బీజేపీ నాయకులు పలు వాహనాల్లో తరలివెళ్ళారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింలు, బాలకిషన్, సతీష్, రాజేష్ తదితరులున్నారు.

భిక్కనూరు నుంచి..

భిక్కనూరు : మెదక్ జిల్లా అల్లాదుర్గ్‌లో ప్రధాని మోదీ సభకు భిక్కనూరు నుంచి మంగళవారం బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. మండలం నుంచి ఐదు వేల మంది విశాల్ సభకు వెళ్లినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేశ్, సీనియర్ నాయకుడు అత్తెల్లి తిర్మలేష్‌లు తెలిపారు.

తాడ్వాయి నుంచి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలానికి చెందిన బీజేపీ నేతలు మంగళవారం జహీరాబాద్ పార్లమెంటు పరిధిలోని అల్లాదుర్గంలో జరిగిన మోదీ బహిరంగసభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మరోసారి బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. రాజిరెడ్డి, యాదగిరి, కిషన్‌రావు, నర్సిములు, దత్తు, మహేష్, రవి, రాజు, తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

బిల్లు చెల్లింపులో జాప్యం

- జీపీ గేటుకు తాళం వేసిన కాంట్రాక్టర్



బాన్సువాడ : బిల్లు చెల్లింపులో జాప్యంపై ఆగ్రహించి గ్రామ పంచాయితీ కార్యాలయ గేటుకు తాళం వేసి కాంట్రాక్టర్ నిరసన వ్యక్తం చేశారు. వివరాలు.. బీర్కూర్‌లో 2022లో గ్రామ పంచాయితీ దుకాణ సముదాయాన్ని కాంట్రాక్టర్ విజయ్ నిర్మించారు. రూ.30 లక్షల నిధులు మంజూరు కావడంతో దుకాణ సముదాయం నిర్మాణం చేపట్టారు. 2022 నుంచి రెండు విడతల్లో రూ.20 లక్షల బిల్లులు చెల్లించారు. మిగతా రూ.10 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బకాయి పడ్డ రూ.10 లక్షల బిల్లుల కోసం రెండేళ్లుగా జీపీ కార్యాలయం చుట్టూ తిరిగినా అప్పటి కార్యదర్శి, సర్పంచు బిల్లు చెల్లింపులో జాప్యం చేశారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు జీపీకి వచ్చిన విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ విజయ్ జీపీ ప్రధాన గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. అప్పుడే డీపీవో, విజయ్‌ను పిలిచి మాట్లాడారు. బిల్లుల విషయమై డీపీవో ముందు కాంట్రాక్టర్ కంట తడి పెట్టుకున్నారు. లిఖిత పూర్వకంగా తనకు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తానని డీపీవో చెప్పారు.

బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాదు

- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్



మాట్లాడుతున్న రాములు నాయక్

ఎల్లారెడ్డి/బాన్సువాడ: పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో ఒక్క సీటు కూడా రాదని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ జోస్యం చెప్పారు. మంగళవారం ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఎంత ప్రచారం చేసినా ఒక్క ఎంపీ సీటు రాదని అన్నారు.

అబద్ధాలు ఆడడంలో మోదీ గిన్నిస్ రికార్డు

రిజర్వేషన్ల రద్దుపై ప్రధాన మంత్రి మోదీ అబద్ధాలు ఆడడంలో గిన్నిస్ రికార్డు బద్దలు కొట్టారని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆరోపించారు. బీజేపీ-కాంగ్రెస్ మధ్య జరుగుతున్న ఈ ఎన్నికలు గాడ్సే-గాంధీల మధ్య జరుగుతున్నాయని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని అన్నారు. కాంగ్రెస్‌లో ప్రతీ ఒక్కరికి గుర్తింపు ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి: ఏనుగు

జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కోరారు. 2014లో దళితుడ్ని ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. రుణమాఫీ చేస్తామని పదేళ్ల ప్రజలను మోసం చేసిన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 100 రోజులైనా కాకముందే రుణమాఫీ చేయాలని చెప్పడం శోచనీయమని అన్నారు. బిల్లులు రాకుండా తాను అడ్డుకుంటున్నానని ఎమ్మెల్యే పోచారం తనపై ఆరోపణలు చేస్తున్నారని, ఆలయంలో ఇద్దరం ప్రమాణం చేద్దామా అని ప్రశ్నించారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): అయిలాపూర్‌లో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని గౌడ్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. గౌడ సంఘం నాయకులు విఠల్‌గౌడ్, సాయాగౌడ్, కిష్టాగౌడ్, సాయాగౌడ్, రజినీకాంత్‌గౌడ్, నరేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం



భిక్కనూరు : మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి 2000-2001 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం జరిపారు. వారు చదువుకున్న పాఠశాలలో నిర్వహించుకున్న ఈ కార్యక్రమానికి 34 మంది విద్యార్థినులు హాజరయ్యారు. 23 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీరందరూ ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూతను అందిస్తామన్నారు.

కాలనీల్లో చైర్‌పర్సన్ పర్యటన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని గొల్లవాడ, ఇస్లాంపుర కాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియా మంగళవారం పర్యటించారు. వార్డుల్లో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పూడుకుపోయిన మురికి కాలువను పరిశీలించి ప్రొక్లెయినర్ ద్వారా శుభ్రం చేయించారు. కౌన్సిలర్లు శివకృష్ణమూర్తి, వంశీ, నాయకులు అంజాద్, ప్రసాద్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బొమ్మన్‌దేవ్‌పల్లిలో మంగళవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రక్త ,మూత్ర, గుండె సంబంధిత పరీక్షలు చేశారు. అనంతరం మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ధాన్యం లారీ బోల్తా



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట గ్రామ శివారులో కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం వేకువజామున ధాన్యం లారీ బోల్తా పడింది. మండలంలోని మత్తమాల ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి కామారెడ్డికి ధాన్యం బస్తాలను తరలిస్తున్న లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు.

మక్కకంకులు దగ్ధం



భిక్కనూరు: మండలంలోని మల్లుపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో 35 క్వింటాళ్ల మక్క కంకులు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మాలే దుర్గయ్య తన వ్యవసాయ క్షేత్రం వద్ద మక్కజూడును తీసి కంకులను ఒక దగ్గర పోశాడు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి రూ.85వేల విలువైన కంకులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి ప్రమాదస్థలానికి వెళ్లి బాధిత రైతు దుర్గయ్యను పరామర్శించి ఓదార్చారు.

టాస్క్‌ఫోర్స్ అదుపులో ఫైనాన్షియర్?

ఖలీల్ వాడి: నగరానికి చెందిన బైక్ ఫైనాన్షియర్ ఒకరిని మంగళవారం జిల్లా కోర్టు సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సదరు వ్యక్తి బైక్‌లు, కార్లు తనాఖా పెట్టుకొని ఫైనాన్స్ చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎంత మంది కలిసి ఫైనాన్స్ నడుపుతున్నారని విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయమై టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

బెల్టు షాపులపై దాడి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతోపాటు పర్మళ్ల గ్రామంలో బెల్ట్‌షాపులపై స్పెషల్ పార్టీ పోలీసులు మంగళవారం దాడి చేసినట్లు ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ తెలిపారు. కామారెడ్డికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పెషల్ పార్టీ సీఐ సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో లింగంపేటలోని ఆకుల సాయిలుకు చెందిన దుకాణంలో తనిఖీ చేసి 2 లీటర్ల లిక్కర్, 15 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నారన్నారు. అలాగే పర్మళ్ల గ్రామానికి చెందిన నాందేవ్ ఇంటిపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

రైలుకిందపడి ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: అప్పుల బాధ భరించలేక రైలుకిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవెంచర్ సమీపంలోని రైలుపట్టాలపైకి వెళ్లి ఆర్యనగర్‌కు చెందిన రాజవరపు శ్రీనివాస్ (50) ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



నిజాంసాగర్(జుక్కల్): కామారెడ్డి జిల్లా మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా గ్రామ పంచాయతీకి చెందిన కడావత్ హిరిబాయి(65) సోమవారం రాత్రి వడదెబ్బతో మృతి చెందింది. రెండు, మూడు రోజుల నుంచి వరిధాన్యాన్ని ఆరబెట్టిన హిరిబాయి ఎండ దెబ్బకు గురై ఆకస్మత్తుగా మృతి చెందిందని తండావాసులుల తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



కార్తీక్ (ఫైల్)

ఎడపల్లి (బోధన్): మండలంలోని అశోక్‌సాగర్ దర్గా వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జానకంపేటకు చెందిన కార్తీక్(20), అర్బాస్ ఖురేషీ నెహ్రూనగర్‌లో జరిగిన వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా.. బోధన్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న కార్తీక్ ఎగిరి అశోక్‌సాగర్ చెరువు పక్కన, తలకు, శరీర భాగాలకు తీవ్రగాయాలై అర్బాస్ ఖురేషీ రోడ్డుపై పడిపోయారు. ప్రమాదంలో ఒక్కడే ఉన్నట్లు భావించిన స్థానికులు అర్బాస్‌ను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కార్తీక్‌ను ఎవరూ మరుసటి రోజు మధ్యాహ్నం 12గంటల వరకు ఎవరూ గమనించలేదు. అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బైక్ కార్తీక్‌ది కావడంతో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని పరిసరాల్లో వెతకగా మృతదేహం లభించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని కార్తీక్ మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పిన ఘటనలో మరొకరు..



ఘటనాస్థలంలో నర్సింలు మృతదేహం

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ శివారులో జాతీయ రహదారి 44పై బైక్ అదుపు తప్పిన ఇత్వార్‌పేట్‌కు చెందిన గజ్జల నర్సింలు (34) మృతి చెందాడు. బాల్కొండ ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. నెలరోజుల క్రితం నర్సింలు జలాల్‌పూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా చేయి విరిగింది. చేయికి ఉన్న కట్టును మార్పించుకునేందుకు మంగళవారం కిసాన్‌నగర్‌కు చెందిన మిత్రుడు చక్రధారి శ్రావణ్‌కుమార్‌తో కలిసి బైక్‌పై ఆర్మూర్‌కు వెళ్తుండగా చిట్టాపూర్ శివారులో బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలై నర్సింలు అక్కడికక్కడే మృతి చెందగా, శ్రావణ్‌కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బైక్ ఢీకొట్టిన ఘటనలో లింగంపేట్ మండలం మోతె గ్రామానికి చెందిన అగ్గు సాయన్న(70) మృతి చెందాడు. మంగళవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ఎర్రాపహాడ్‌కు చెందిన గోపాల్ తన భార్యతో కలిసి బైక్‌పై కామారెడ్డి నుంచి ఎర్రాపహాడ్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిషత్ సమీపంలో రోడ్డువెంబడి నడుచుకుంటూ వెళ్తున్న సాయన్న సడెన్‌గా బైక్‌కు అడ్డువచ్చాడు. ఈ ఘటనలో సాయన్న తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న గోపాల్ దంపతులకు సైతం తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించారు.

బెంచీ పైనుంచి పడి ఒకరు..

రెంజల్ (బోధన్): హోటల్‌లో టిఫిన్ చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు బెంచీ పైనుంచి కిందపడి మృతి చెందిన సంఘటన మండలంలోని కూనేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గురప్ప (65) కుమారుడు సాయిలు బోధన్‌లో పని చేస్తూ అక్కడే ఉంటుండగా, ఒంటరిగా ఉంటున్న గురప్ప గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడు. ఇటీవల రెంజల్ దగ్గర బైక్ పైనుంచి పడిపోయిన గురప్ప అనారోగ్యం పాలయ్యాడు. అప్పటి నుంచి బోధన్‌లో కుమారుడి వద్ద ఉన్న ఆయన ఇటీవలే గ్రామానికి వచ్చాడు. మంగళవారం స్థానిక హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా బెంచీ పైనుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గురప్ప ఎండదెబ్బ కారణంగా మృతి చెందాడా? లేక గతంలో అయిన గాయాల కారణంగా మృతి చెందాడా? అనేది పోస్టుమార్టంలో తేలుతుందని ఎస్సై అన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెట్టును ఢీకొట్టిన తుఫాన్

- ఏడుగురికి గాయాలు
- కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మాచారెడ్డి: చెట్టును తూఫాన్ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మండలంలోని ఘన్‌పూర్ స్టేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందెడ్‌కు చెందిన చంద్రకళ, సంతోష్, శశికళ, అశ్విని, భాగ్యశ్రీ, గణపతి, లక్ష్మణ్ కామారెడ్డి వైపు నుంచి తుఫాన్ వాహనంలో వేములవాడ వెళ్తున్నారు. ఈక్రమంలో కామారెడ్డి - సిరిసిల్ల రహదారిపై ఘన్‌పూర్‌స్టేజీ వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీ కొట్టి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఏడుగురితోపాటు ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన మంద సాయిలు (55) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. తన తండ్రి గత మూడు రోజులుగా కనిపించడం లేదని సాయిలు కుమారుడు సతీశ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. అప్పులు చేస్తున్నాడని కుటుంబ సభ్యులు ఈనెల 27న మందలించారని, ఆ రోజు తిని పడుకున్న సాయిలు మరుసటి రోజు ఉదయం కనిపించ లేదని తెలిపారు. బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రుద్రూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రుద్రూర్: మండల కేంద్రం శివారులోని కామధేను రైస్‌మిల్ వెనుక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. మృతుడు మెడలో హన్మంతుడి లాకెట్, తెల్లని మొలతాడు, లుంగీ ధరించి ఉన్నాడని వివరించారు. మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 59785 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రైవేట్ ఆస్పత్రిపై విచారణ

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న కీర్తిసాయి ఆస్పత్రి డాక్టర్ వైద్యం వికటించి ఇటీవల గర్భిణి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మంగళవారం విచారణ ప్రారంభించారు. మాక్లూర్ మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశిష్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగగా, నివేదికను వైద్యారోగ్యశాఖకు అందించనున్నారు. బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చినట్లు తేలగా, డాక్టర్‌తోపాటు ఆస్పత్రిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో త్వరలో తేలనుంది.